ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025 8 పేజీలు






ప్రకాశం బాపట్ల

## గణతంత్ర దినోత్సవాన్ని

# ఘనంగా నిర్వహించాలి

### కలెక్టర్ వెంకటమురళి




మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. 76వ గణతంత్ర దినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం కోసం పోలీస్ కవాతు మైదానాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ కవాతు నిర్వహించేలా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సిసి క్యాడెట్లు, స్కౌట్స్ విద్యార్థుల ప్రదర్శన నిర్వహణను పోలీసులు పర్యవేక్షించాలన్నారు. వేడుకలు జరిగే మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా వేదిక అలంకరణను ఆర్డీవో పర్యవేక్షించాలన్నారు. వేడుకలు జరిగే మైదాన ప్రాంతం పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మున్సిపల్ కమిషనర్‌దేనని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా స్టాల్స్ సిద్ధం చేయాలన్నారు. 11 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధిని చాటి చెప్పేలా 14 శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శన ఉండాలన్నారు.

వేడుకల నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. స్వాతంత్ర్య ▶ 2లో

# అమిత్‌షా గోబ్యాక్..!

- కేంద్ర మంత్రివర్గం నుండి వైదొలగాలి..
- 19న అమిత్‌షా రాకను వ్యతిరేకిస్తూ నిరసనలు..
- వామపక్ష పార్టీల పిలుపు..




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 19న విజయవాడ రాకను వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ నాయకులు మాట్లాడుతూ దేశంలో అంబేద్కర్ రచించిన 'భారత రాజ్యాంగానికి' బదులుగా 'ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని' అమలు చేసే దిశగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రణాళికబద్ధంగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ని అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రేపుతున్నారని విమర్శించారు. అమిత్‌షా రాకను నిరసిస్తూ ఈ నెల 19న వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు లలిత కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆర్.వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీరామ్‌శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ అభ్యర్థి

# లక్ష్మణరావును గెలిపించుకుందాం..

### ప్రచార పోస్టర్ ఆవిష్కరణ




ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యుటిఎఫ్ నేతలు

**ప్రజాశక్తి-గుంటూరు**

కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్‌రావు, జె.వినయ్, ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడతానని, మండలిలోనూ, బయటా పోరాటం చేస్తానని పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ నిజాయతీ, నిబద్ధతతో పనిచేసే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆవులమంద'లో

# బెల్టుషాపులు తీసేయాల్సిందే..

### తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన



తహశీల్దార్‌కు అర్జీ ఇస్తున్న మహిళలు

**ప్రజాశక్తి-కురిచేడు**

తమ గ్రామంలో మద్యం బెల్టుషాపుల వల్ల కుటుంబాలు గుల్లవుతున్నాయని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆవులమంద గ్రామస్తులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆవులమంద పంచాయతీలో ఏడు గ్రామాలు ఉండగా ఆవుల మంద గ్రామంలోనే ఎనిమిది బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. మద్యం తాగి.. తాగుబోతులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గొడవలు చేస్తున్నారని, వెంటనే బెల్టుషాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ బి.రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారుల దష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆందోళనకారులు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లారు. అక్కడికి ఒక కేసు విషయంపై వచ్చిన త్రిపురాంతకం సిఐ హుస్సేన్‌కు బెల్టుషాపులు తొలగించాలని వినతిపత్రం అందజేశారు. సిఐ మాట్లాడుతూ గ్రామాలలో బెల్టుషాపులు నిర్వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం వస్తే.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఎక్సైజ్ పోలీసుల దాడులు**

ఆవులమంద గ్రామస్తుల ధర్నాతో ఎక్సైజ్ పోలీసులు స్పందించారు. దర్శి ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆవులమంద గ్రామంలో అనుమానిత దుకాణాలు, ఇళ్లను పరిశీలించారు. మహిళల ధర్నా విషయం తెలుసుకున్న బెల్టుషాపుల నిర్వాహకులు జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది.

# 'వాలంటీర్స్' అసోసియేషన్ నేతల అరెస్టు

- 'చలో అసెంబ్లీ'కి వెళ్లనీయకుండా అడ్డగింత
- రాష్ట్ర అధ్యక్షులు బాషా, జిల్లా అధ్యక్షులు శ్రీను అరెస్టు




వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో బాషా, శ్రీను

**ప్రజాశక్తి-వేటపాలెం**

ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వాలంటీర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చిన చలో అసెంబ్లీ కార్యక్రమంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కార్యక్రమానికి వెళ్లనీయకుండా నాయకులను అరెస్టు చేశారు. వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయున్ బాషాను గురువారం రాత్రి పది గంటల నుండి వేటపాలెం మండలం, రామన్నపేట పంచాయతీ, సమైక్య నగర్‌లో ఉన్న ఇంటి వద్దే పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉదయం ఏడు గంటల నుండి వేటపాలెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి.. మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. చీరాల రైల్వేస్టేషన్ వద్ద విజయవాడలో వాలంటీర్ల ధర్నా కార్యక్రమానికి వెళుతున్న వాలంటీర్ల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు పల్లపోలు శ్రీనుని అరెస్టు చేసి.. వేటపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాలంటరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హుమాయున్ బాషా 'ప్రజాశక్తి'తో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. పోలీసులతో పోరాటాలను ఆపాలని చూడటం అవివేకమైన చర్య అన్నారు. రాత్రి 10 గంటల నుండి ఇల్లు కదలకుండా నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస అవసరాలు కూడా తీర్చుకోకుండా ఉద్యమాలను అణగదొక్కే ప్రయత్నం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, బలవంతంగా రాజీనామాలు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని, రూ.10 వేల వేతన హామీ నెరవేర్చాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగం రాలేదని..

# యువకుడు ఆత్మహత్య

3లో ▶

## గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

సమరయోధులు, వారి కుటుంబ సభ్యులు ఉంటే వేడుకలకు ఘనంగా ఆహ్వానించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. వేడుకలలో పాల్గొన్న వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అతిథులకు గ్యాలరీలు ఏర్పాటు చేసి ఘనంగా ఆహ్వానించాలన్నారు. జిల్లా అభివద్ధిలో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు ఉత్తమ పరిష్కారాలు అందించాలన్నారు. ఎంపిక ప్రక్రియ శరవేగంగా చేపట్టాలన్నారు. రాజభవన్‌లో జరిగే వేడుకలలో పరిష్కారాలు అందించడానికి సామాజిక సేవలు, పర్యావరణ పరిరక్షణ కోసం విశేషంగా కషి చేస్తున్న వారిని ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, అదనపు ఎస్‌పి విఠలేశ్వర్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వాహనదారులకు జరిమానా

**ప్రజాశక్తి-మద్దిపాడు**

నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శివరామయ్య తెలిపారు. మండల పరిధిలోని మద్దిపాడు నుంచి వెల్లంపల్లికి వెళ్లే నేషనల్ హైవే సర్వీస్ రోడ్డులో వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివరామయ్య మాట్లాడుతూ రాంగ్ రూట్లో వాహనదారులు ప్రయాణిస్తే ప్రమాదాలు జరుగుతాయని వాటిని నివారించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటించుకుంటే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. అనంతరం సుమారు 15 వాహనాలకు చలనాలు విధించారు. ఎస్‌ఐ వెంట సిబ్బంది ఉన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న సిఐ

## ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి

**ఆటో డ్రైవర్‌లకు సిఐ కౌన్సెలింగ్**

**ప్రజాశక్తి-కొండపి**

ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లు సహకరించాలని సిఐ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన ఆటోడ్రైవర్లతో సమావేశమయ్యారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి జనాన్ని ఎక్కించుకోకూడదన్నారు. ఆటో వెనుక సైడు, చెక్క మీద ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. రోడ్డు వెంబడి ఎక్కడంటే అక్కడ పార్క్ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే పెనాల్టీలు విధిస్తామని సిఐ సోమశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రేమ్ కుమార్, ఏఎస్‌ఐ అంకారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే: ఎస్‌ఐ

**ప్రజాశక్తి-కొండపి**

వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లవలసి వస్తుందని ఎస్‌ఐ ప్రేమకుమార్ తెలిపారు. శుక్రవారం కొండేపిలోని కామేపల్లి రోడ్డు, టంగుటూరు ప్రధాన రహదారిలో మద్యం తాగి వాహనాల నడుపుతున్న వాహనదారులకు డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే ప్రమాదాల బారినపడతారని వాహనదారులకు పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### పంట కాలువల అభివృద్ధి పనులు

# ఏప్రిల్‌లో చేపట్టాలి: కలెక్టర్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

నీటిపారుదల శాఖ ద్వారా చేపట్టిన కాలువల అభివద్ధి పనులను ఏప్రిల్ చివరినాటికి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాగార్జున సాగర్ కాలువలు, కష్ణ పశ్చిమ డెల్టా కాలువల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి ఏప్రిల్ చివరినాటికి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నాగార్జునసాగర్ కాలువలు, కష్ణ పశ్చిమ డెల్టా కాలువల జూన్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గుంటూరు-పర్చూరు ఛానల్ పనుల ప్రతిపాదనలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలన్నారు. రైతులకు సాగునీరు అందించడానికి ఇబ్బంది లేకుండా కాలువల్లో సివిల్ వర్క్స్, పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. అద్దంకి నియోజకవర్గంలోని నాగార్జున సాగర్ ఆయకట్టు చివరి భూములకు మార్చి చివరివరకు సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో గుంటూరు ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరత్నం, ఇరిగేషన్‌శాఖ ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డ్రైనేజి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.మురళీకష్ణ, ఇరిగేషన్ శాఖ అద్దంకి డిప్యూటీవ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగ మురళీమోహన్, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

# అబ్దుల్ సాద్‌కు కలెక్టర్ అభినందనలు

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

ఆంధ్ర అండర్-14 క్రికెట్ టీంలో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్‌కు అవకాశం దక్కింది. అండర్ 14 ఆంధ్ర క్రికెట్ టీంలో ఎంపికైన అబ్దుల్ సాద్ ఉనైస్‌ను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, బాపట్ల జిల్లా కీర్తిని మరింత ఇనుమడింప చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు. క్రీడా రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 స్టేట్ టీంలో బాపట్ల లిటిల్ ఫ్లవర్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అబ్దుల్ సాధ్ ఉనైస్‌కు అవకాశం దక్కటం అభినందనీయమని బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు రఘునాథ్ అన్నారు. గత నెలలో జరిగిన అండర్ 14 జిల్లాస్థాయి ఎంపికల్లో తొలిసారిగా పాల్గొని గుంటూరు జిల్లా టీంలో ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యారు. కృష్ణ, చిత్తూరు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం, అనంతపూర్, విశాఖపట్నం జిల్లాలతో జరిగిన పోటీల్లో తన ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. విద్యార్థి అబ్దుల్ సాద్. వివిధ జిల్లాల్లో జరిగిన క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో విశేషమైన ప్రతిభ కనబరిచారు. ఆంధ్ర అండర్ 14 క్రికెట్ టీంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది క్రీడాకారుల్లో ఈ బాపట్ల విద్యార్థి స్థానం దక్కించుకున్నాడు. చివరిగా విజయనగరంలో జరిగిన జోనల్ పోటీల్లో 17 మందితో కూడిన ఆంధ్ర అండర్ 14 క్రికెట్ టీం ఎంపిక చేశారు. అందులో అబ్దుల్ సాద్ కూడా ఒకరు కావడం విశేషం.ఈ నెల 27వ తేదీ నుండి ఫిబ్రవరి 18వ తేదీ వరకు పాండిచ్చేరిలోజరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 మ్యాచ్‌లో అబ్దుల్ సాద్ పాల్గొనబోతున్నారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన అబ్దుల్ సాద్‌ను ఉత్తమ క్రీడాకారుడుగా తీర్చిదిద్దటంలో కృషిచేసిన కోచ్ అమీర్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్, స్టాన్లీ విమల్ కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ సాద్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వెంకట మురళి



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

## క్రికెట్ టోర్నమెంట్ విజేత దాసిరెడ్డిపాలెం

**ప్రజాశక్తి-కొండపి**

మర్రిపూడి మండలం ధర్మవరం గ్రామంలో జరిగిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటులో కొండపి పంచాయతీకి చెందిన దాసిరెడ్డిపాలెం లెవెన్సు మొదటి బహమతి సాధించినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోటీలు ఈనెల 7వ తేది నుంచి 17వ తేది వరకు నిర్వహించడం జరిగింది. దాదాపు 50 టీంలు పాల్గొనగా అందులో మొదటి బహుమతి దాసిరెడ్డిపాలెం లెవెన్స్ రూ.22వేలు గెలుచుకోవడం జరిగింది. అలాగే రెండవ బహుమతి ధర్మవరం టీంకు రూ.17 వేలు గెలుచుకోవడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన వారికి శుక్రవారం నగదు బహుమతులు నిర్వాహకుల చేతుల మీదుగా అందచేశారు.



## ఉపాధి పనుల్లో అక్రమాలు

**ప్రజాశక్తి-కొండపి**

కొండపి పంచాయతీలో జాతీయ ఉపాది హామీ పనులపై జరుగుతున్న సామాజిక తనిఖీలలో భారీస్థాయిలో అక్రమాలు వెలుగుచూశాయి. పనికి వెళ్లని వారికి, ఒకే వ్యక్తికి డబుల్ జాబ్‌కార్డులు, పనులు చేయకుండాలనే చేసినట్లు చూపించి అవినీతికి పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. వాలంటీర్ బినామీ పేర్లు, కొలతలలో తేడా, మస్టర్‌లో తేడా కనిపంచాయని సామాజిక బృందం వారు తెలిపారు. ఈ నివేదికను పై అధికారులకు అందచేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

**నేడు ప్రజావేదిక**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై నేడు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎస్ఆర్‌పి వెంకటేశ్వర రావు తెలిపారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కొండపి మండలంలోని పంచాయతీ రాజ్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గృహ నిర్మాణ శాఖ, పశు సంవర్ధక శాఖ, సర్వ శిక్షా అభియాన్ మరియు అటవీ శాఖల రికార్డు కాలములో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా వేదిక ఏర్పాటు చేయడమైనది తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు,హాజరు కావాలని ఆయన కోరారు.



మృతదేహాన్ని తీసుకొస్తున్న మెరైన్ పోలీసు

సముద్రంలో గల్లంతైన

# పవన్ మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

శింగరాయకొండ మండలంలోని పాకల సముద్రతీరంలో గురువారం సముద్రంలో గల్లంతైన తమ్మిశెట్టి పవన్ (21) మృతదేహం శుక్రవారం అలలపై తేలియాడుతూ కనిపించారు. శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరామ్ నగర్ చెందిన తమ్మిశెట్టి పవన్ అమెజాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ హైదరాబాదు నుంచి సంక్రాంతికి ఊరికి వచ్చారు. శుక్రవారం మిత్రులతో కలిసి సరదాగా సముద్ర తీరానికి వెళ్లి ఒక్కసారిగా అలల తాకిడికి సముద్రంలో గల్లంతయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన అందరినీ కలిచివేసింది. పవన్ మృతదేహం కోసం మంత్రి స్వామి, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు రెవిన్యూ అధికారులకు సూచన చేశారు. శుక్రవారం కూడా రెవెన్యూ అధికారులు, పోలీసులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వెతుకులాటను ముమ్మరం చేశారు. ఉదయం తహశీల్దార్ టి.రవి, ఆర్ఐ ప్రసాద్, ఎస్ఐ బి.మహేంద్ర, సర్పంచ్ సైకం చంద్రశేఖర్, మెరైన్ మత్స్యకారుల సహకారంతో రెండు బోట్లతో 200 పైగా గాళాలుతో వెతికారు. చివరకు పాకల పరిధిలోనే చెల్లెమ్మగారి పట్టపుపాలెం వద్ద అలలపై పవన్ మతదేహం తేలాడుతూ కనిపించింది. మెరైన్ పోలీసులు సముద్రంలోకి వెళ్లి అలల తాకిడిని తట్టుకొని బయటకు పవన్ మృతదేహాన్ని తీసుకొచ్చారు. మృతదేహానికి పంచినామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.



పవన్ (ఫైల్)

**25 గంటలుగా ఎదురుచూపులు....**

సముద్రంలో గల్లంతైన తమ్మిశెట్టి పవన్ చివరి చూపు కోసం కుటుంబ సభ్యులు 25 గంటలపాటు సముద్రం వద్దే ఎదురు చూశారు. తండ్రి తమ్మిశెట్టి రంగయ్య గురువారం మధ్యాహ్నం కొడుకు గల్లంతయాడని తెలుసుకొని సముద్రం వద్దకు వచ్చారు. కుమిలి కుమిలి విలపించాడు. ఆ తర్వాత పవన్ అక్క లావణ్య, తల్లి అక్కడికి చేరుకొని ఎదురు చూసారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు పాకల సముద్ర తీరానికి వచ్చి 25 గంటలపాటు సముద్ర తీరం వద్దే పవన్ మృతదేహం కోసం వేచి చూశారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గురువర్ధనరావు(ఫైల్)

**ప్రజాశక్తి-అద్దంకి**

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్న కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న కొత్తపల్లి గ్రామానికి చెందిన మాగంటి గురువర్ధనరావు వ్యక్తిగత పనులు కోసం పట్టణానికి వెళ్తూ చక్రాయపాలెం మూల మలుపు వద్ద కాలకృత్యాలు తీర్చుకుంటుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గురువర్ధనరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించడానికి పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఏడాదిన్నర క్రితం వివాహం కాగా బంధువులు గురువర్ధనరావు మృతదేహం వద్ద బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాలిపోయిన ఇల్లు

## అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

**రూ.4 లక్షల ఆస్తి నష్టం**

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గేదెల సావిడి, ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో సుమారు రూ.4 లక్షల నష్టం జరిగింది. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున మండల పరిధిలోని గుల్లపల్లి కాల్వకట్ట బజార్‌లో జరిగింది. ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన అల్లపర్తి పుల్లారెడ్డికి చెందిన గృహము సావిడి దగ్ధమవడంతో దూడ చనిపోగా, రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంతో గ్యాస్ సిలిండర్ కూడా పేలినట్లుగా తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు.



దగ్ధమవుతున్న వరిగడ్డి

## వరిగడ్డి వాము దగ్ధం

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

మండల పరిధిలోని ఆరుంభాకలో 15 ఎకరాల గడ్డివాము దగ్ధమైన శుక్రవారం సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన తోట అప్పయ్యకు చెందిన 15 ఎకరాల గడ్డివాము నిప్పంటుకోవడంతో గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. పొన్నూరు నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్ మంటలను అదుపు చేసింది. అప్పటికే గడ్డివాము చాలా మేరకు దగ్ధమయింది. గ్రామస్తులు వెంటనే జెసిబిల సహాయంతో కాలుతున్న గడ్డిని నెట్టివేయడంతో ప్రమాదం తప్పింది. సుమారు రెండు లక్షల రూపాయలు నష్టం వాటిలినట్లు బాధితుడు తోట అప్పయ్య తెలిపాడు. అగ్ని ప్రమాదం జరిగిన తీరు పట్ల బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు.

# ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య

**ప్రజాశక్తి-మార్కాపురం**

ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురైన ఓ నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మార్కాపురం మండలంలోని రాయవరం వద్దగల రైల్వే ట్రాక్‌పై శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన వెన్నా తిమ్మారెడ్డి (33) బీటెక్ పూర్తి చేశాడు. ఇంజనీరింగ్ చదివినా ఏ కంపెనీలో కూడా పని చేసేందుకు అవకాశం దక్కలేదు. ప్రభుత్వ ఉద్యోగ వేటలోనూ అతను ఓడిపోయాడు. ఉన్నత చదువులు పూర్తి చేసినా నిరుద్యోగిగా ఉండిపోవడంతో తిమ్మారెడ్డి మనస్తాపానికి గురయ్యాడు. వివాహం కూడా కాలేదు. ఈ సంఘటనలన్నీ అతడిని బాధించాయి. తనువు చాలించాలని నిర్ణయం తీసుకున్నాడు. నిరుద్యోగిగా జీవించడం కష్టమని తోటి స్నేహితుల వద్ద పదేపదే అనేవాడని తెలిసింది. శుక్రవారం ఉదయం గుంటూరు వెళుతున్నట్లు తల్లి దండ్రులు లక్ష్మమ్మ, నారాయణరెడ్డిలకు చెప్పాడు. రాయవరం వద్దగల రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ప్రయాణిస్తున్న రైలు కింద పడ్డాడు. దీంతో తల పగిలి అక్కడికక్కడే తిమ్మారెడ్డి మృతి చెందాడు. లక్ష్మమ్మ-నారాయణరెడ్డి దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా తిమ్మారెడ్డి ఒక్కడే కుమారుడు. కుమారుడు తిమ్మారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు తల్లడిల్లిపోయారు. ప్రమాద విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న తిమ్మారెడ్డి

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చదలవాడ ఎస్‌సి కాలనీ వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఓమ్మెవరం గ్రామానికి చెందిన అల్లంనేని ప్రతాప్ (64) కుమారుడు చంద్రా ఆదిత్య ద్విచక్రవాహనంపై ఒంగోలు వెళ్తున్నారు. చదలవాడ ఎస్సీ కాలనీ సమీపంలో చదలవాడ గ్రామానికి చెందిన అలవలపాటి శ్రీనివాసరావు, దేవరం పల్లి వేణు ద్విచక్రవాహనంపై ముందు వెళ్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో తండ్రీ కొడుకులు కిందపడిపోయారు. ప్రతాప్ తలకు బలమైన గాయాలు కాగా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బి.శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. చంద్రాఆదిత్యకు తల్లి లేదు. 7 నెలల క్రితం నాయనమ్మ చనిపోయింది. ఇప్పుడు తండ్రి చనిపోవడంతో అనాథగా మిగాలాడు. ఈయన మద్రాసులో బీటెక్ చదువుతున్నాడు.



మృతి చెందిన ప్రతాప్

# ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీ

**నలుగురికి తీవ్ర గాయాలు**

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం చెరుకుపల్లి మండల పరిధిలోని పొన్నపల్లిలో జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం స్థానిక కారుమూరమ్మ గుడి సమీపంలో గుల్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన గున్నం రాజు, గుణ్ణం అంకమరావు, శెట్టి పోతురాజు, నడింపల్లి పంచాయతీ అనగాని వారి పాలెం గ్రామానికి చెందిన వీరంకి కోటేశ్వరరావుకు చెందిన ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

## యువకుడు అనుమానాస్పద మృతి

**ప్రజాశక్తి-కురిచేడు**

యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం కురిచేడు మండలంలోని నమశ్శివాయపురం అగ్రహారంలో జరిగింది. ఎస్ఐ ఎం.శివ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాణ్యం యశ్వంత్ (25) స్థానిక యూనియన్ బ్యాంక్ పక్కన ఉన్న గృహంలో మృతి చెంది ఉన్నాడు. పక్కనే పురుగుల మందు డబ్బా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన యశ్వంత్

# మార్కెట్ కమిటీలతో రైతుకు భరోసా

**అసిస్టెంట్ డైరెక్టర్ ఉపేంద్ర కుమార్**

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

రైతుకు భరోసా ఇచ్చే లక్ష్యంగా వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ కృషి చేస్తోందని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిఎన్ ఉపేంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరానికి "రైతుబంధు పథకం "అమలుకు రూ.3.40 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభ్యం కాని పక్షంలో రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్ కమిటీలలో తనఖా ఉంచి వాటిపై 75 శాతం వరకు రుణాలు పొందే పొందేందుకు ఈ పథకం తోడ్పడుతుందన్నారు . జిల్లాలో మార్కెట్ ఫీజు కింద 10 వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా, రూ 146.3 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రైతు బజార్లకు తోడు అదనంగా మూడు ప్రాంతాలలో నాలుగు రైతు బజార్లు ఏర్పాట్లకు ప్రతిపాదన పంపినట్లు ఆయన వివరించారు. ఒంగోలులో రామ్‌నగర్, కర్నూల్ రోడ్డు నుంచి పాల డైరీ మధ్య, చీమకుర్తి, మార్కాపురంలో రైతు బజార్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామన్నారు. స్థలాలు ఎంపిక చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకష్ణ సబ్ కలెక్టర్‌లకు, ఆయా మున్సిపల్ కమిషనర్లకు లేఖలు రాశారని వివరించారు. జిల్లాలో ప్రైవేట్ పశువుల సంతల నిర్వహణకు ప్రైవేట్ సంస్థలకు అనుమతులు ఇస్తామన్నారు. నిర్వాహకులు సంప్రదిస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేట్ వ్యక్తులు సంతలు నిర్వహించుకోవాల్సి ఉంటుందని తెలిపారు.



ఉపేంద్ర కుమార్

## హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే చర్యలు

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు కఠినంగా ఉంటాయని శింగరాయకొండ సిఐ సిహెచ్. హజరత్తయ్య అన్నారు. శుక్రవారం నాడు శింగరాయకొండ సర్కిల్ కార్యాలయం వద్ద మోటార్ బైక్‌లు నిలిపి అవగాహన కల్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మోటార్ వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలన్నారు. అలా హెల్మెట్ వాడకుండా నడిపితే చర్యలు ఉంటాయన్నారు. లైసెన్సు, ఇన్సూరెన్స్ కూడా దగ్గర ఉంచుకోవాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ



గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రజలు

## చందలూరులో గ్రామోత్సవం

**ప్రజాశక్తి - పంగులూరు**

మండల పరిధిలోని చందలూరు గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారి గ్రామోత్సవం తిలకించారు. ఈ సందర్భంగా చందలూరు గ్రామ వీధులు కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజామున బాలభోగం గావించి, ముత్తైదువులకు పూలు, గంధం, కుంకుమ అర్పించి శాస్త్రవేత్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు అమ్మవారికి పూలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు చందలూరు పరిసర గ్రామాల ప్రజలు వేలాదిగా తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పుల్లెలతలాటి వంశస్తులు సేవలో భాగంగా రాత్రి సమయంలో నిర్వహించిన ప్రభ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభ ఊరేగింపు సందర్భంగా భరతనాట్యం,డ్యాన్స్‌తో గ్రామంలో సందడి నెలకొంది.



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

## ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

**ప్రజాశక్తి-బాపట్ల**

ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని శిఖరంవారివీధిలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహాల నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను తడి చెత్త పొడి చెత్తగా వేరు చేసి చెత్తను సేకరించే వాహనాలకు అందించాలని తెలిపారు. తడి చెత్త,పొడి చెత్త, హానికర వ్యర్థాలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో నివ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. అవసరమైతే ట్రేడ్ లైసెన్స్‌లపై డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పట్టణంలో . క్యారీ బ్యాగుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్తలో 30 శాతం క్యారీ బ్యాగులు ఉంటున్నట్లు తెలిపారు. పారిశుధ్యం విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేద న్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్ స్పెక్టర్లు సిహెచ్. కరుణ, డి.శ్రీనివాసరావు ఉన్నారు.

## నేడు ద్విదశాబ్ది ఉత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి-బాపట్ల**



సాయిబాబు

సమాచార హక్కుచట్ట ద్విదశాబ్ది ఉత్సవాలను శనివారం ప్రారంబి .స్తున్నట్లు ఫోరమ్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి.సాయిబాబు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో నిర్వహిస్తున్న ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్ జోనాథన్ హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో సమాచార హక్కు చట్టం 2005లో అమల్లో కి వచ్చి రెండు దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో ఈ ఉత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 12 వరకూ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పది నెలలపాటు ప్రతి నెలా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సాయిబాబు విజ్ఞప్తి చేశారు

# నాటికలను ఆదరించాలి

**ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు**

**ప్రజాశక్తి -యద్దన పూడి**

ప్రజలు నాటికలను ఆదరించాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు తెలిపారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో ఎన్‌టిఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగురాష్ట్రల స్థాయిలో నిర్వహిస్తున్న నాటికలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం నా శత్రువు, కొండంత అండ, ఏది నిజం (ప్రత్యేక ప్రదర్శన)నాటికలు ప్రదర్శించారు. తొలుత చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పరిషత్ నాటికలు గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. కందుల రమేష్ మాట్లాడుతూ నాటిక పోటీలు సందేశాత్మకంగా ఉన్నాయని తెలిపారు. ప్రపజలు ప్రజలు నాటికలను ఆదరించడం అభినందనీయమన్నారు.ఇ. సాంబశివరావు మాట్లాడుతూ నాటికల్లో పాల్గొనే కళాకారులు ప్రేక్షకులను అలరించడానికి తమ శక్తినంతాదారపోసి నటిస్తున్నట్లు తెలిపారు. చివరి రోజు శనివారం ముఖ్యఅతిథులుగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, పర్చూరు సభ్యులు ఏలూరి సాంబశివరావు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల వంశీ, రావిపాటి సీతయ్య, రంగయ్య చౌదరి, ఎఫర్ట్ డైరెక్టర్ మోహన్‌రావు, ఎన్‌టిఆర్ కళా పరిషత్ సభ్యులు వంశీ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, శివ సుబ్బారావు, జి. శ్రీను, జి. వెంకట సుబ్బారావు, తారక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు



నాశత్రువు నాటికలోని ఓ సన్నివేశం

# సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ వెంకట మురళి**

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా**

సేంద్రీయ వ్యవసాయం ఉత్పత్తులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగించకుండా పండించిన సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సహజ సిద్ధంగా పండించే పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులను అధికారులు, ప్రజలు ప్రోత్సహించాలన్నారు. మరింత ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రీయ ఉత్పత్తులను వినియోగించుకోవాలన్నారు. అధికారుల ఆరోగ్యాన్ని దష్టిలో పెట్టుకొని ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను కలెక్టరేట్లోనే అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఉత్పత్తుల అమ్మకాలు పెరిగితే కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డీడీ విజయనిర్మల, సేంద్రీయ వ్యవసాయ డిపిఎం వాణిశ్రీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

# మినుముకు తెగులు.. రైతు దిగాలు..

- పల్లాకు తెగులుతో దెబ్బతిన్న పంట
- తగ్గిన దిగుబడి
- నష్టాల బాటలో అన్నదాతలు

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

రబీ సీజన్‌లో సాగుచేసిన మినుము పంటకు పల్లాకు తెగులు సోకింది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఐదేళ్ల క్రితం క్రితం ఇదే రీతిలో మినుము పంటకు పల్లాకు తెగులు సోకడంతో దిగుబడి పూర్తిగా పడిపోయింది. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా జొన్న, మొక్కజొన్న పంటలపై మక్కువ చూపారు. జొన్న, మొక్కజొన్న పంటలు కొనేళ్లపాటు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం భూసారం తగ్గి జొన్న, మొక్కజొన్న పంటలో దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీనికి తోడు పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. ధరలు కూడా ఆశాజనకంగా లేవు. రబీకి నీటి విడుదల కూడా సక్రమంగా లేకపోవడంతో ఈ ఏడాది రైతులందరూ మినుము, పెసర పంటలు సాగు చేశారు. మినుము పైరుకు పల్లాకు తెగులు సోకటంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ కురిసిన అధిక వర్షాలకు వరి పంట పూర్తిగా నీట మునిగి దెబ్బతింది.అపరాల పంటల ద్వారా నైనా నష్టాన్ని తగ్గించుకోవచ్చు అనుకున్న అన్నదాతకు పల్లాక తెగులు కత్తి మీద సాములా మారింది. భట్టిప్రోలు, అమతలూరు మండలాల్లో రైతులు ఎక్కువ శాతం అపరాలు సాగు చేశారు. ఇప్పటికే ఎకరాకు పదివేలకు పైగా పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. మరో రూ.10 వేల పైగా ఖర్చు అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. పల్లాకు తెగులు ద్వారా గింజలు ఏర్పడే అవకాశం లేదని, అందువల్ల దిగుబడి తగ్గి పెట్టుబడిగా పెట్టిన ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు మినుము పంటలను పరిశీలించి తగిన సలహాలు,సూచనలు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పల్లా కు తెగులు సోకిన మినుము పైరు

# వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

**'ఉల్లాస్' ఉపసంచాలకులు వెంకటేశ్వరరావు**

**ప్రజాశక్తి-చీమకుర్తి**

వయోజనులకు చదువు ప్రాధాన్యత వివరించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉల్లాస్ ఉపసంచాలకులు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంపై వాలంటరీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి సూపరింటెండెంట్ వి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పర్యవేక్షకులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్, ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతే లక్ష్యంగా కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. ఉల్లాస్ ఉపసంచాలకులు పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రయోజనాలకు పరికరాల కొనుగోలుకు రూ.400 అందజేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిడివో రామాంజనేయులు

**కొండపి:** కొండపి మండల డిఆర్‌డిఏ-వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ - వయోజన విద్యా కార్యక్రమంపై వివోఏలకు, వాలంటీర్ టీచర్లుకి ఏపీఎం గోపినాథ్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ప్రారంభించిన ఉల్లాస్ ప్రోగ్రామ్ వయోజనులు అయిన 18 నుంచి 60 వయస్సు కలిగిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి విడతగా పెరిదేపి, మిట్టపాలెం, నేతివారిపాలెం, నెన్నూరుపాడు, గుర్రపడియ గ్రామాలలో 907 మంది అభ్యాసకులను ఎంపిక చేసి, స్వచ్ఛందగా వారికి శిక్షణా ఇస్తున్నట్లు తెలిపారు. ముందుకు వచ్చిన 90 వాలంటీర్ టీచర్లుచే 45 రోజుల పాటు వీరికి శిక్షణా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, టీచర్లకు, విఓఏలకు కరదీపిక పై శిక్షణ ఇచ్చారు. మహిళలకు ముఖ్యంగా మూడు రకాల శిక్షణలు, ప్రాథమిక విద్య, ఆర్థిక క్రమ శిక్షణ విద్య, డిజిటల్ (సాంకేతిక విద్య)లపై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. శిక్షణ అనంతరం ప్రతి గ్రామానికి కరదీపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిసిలు మల్లిఖార్జున, కృష్ణారెడ్డి, రామాంజనేయులు మరియు సంబంధిత గ్రామాల వీవోఏలు, వాలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.



శిక్షకులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఉల్లాస్ ప్రతినిధులు

## 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలు

# జిల్లా అంతటా చేపట్టాలి

**కలెక్టర్ వెంకట మురళి**

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛత దివాస్ కార్యక్రమాలు ప్రతి నెలా మూడో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛ భారత్ - స్వచ్ఛత మిషన్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని కలెక్టర్ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ప్రజలు ఆరోగ్యంగా, ఆహ్లాదకరమైన వాతావరణంతో జీవించే అవకాశాలను కల్పించాలని ఉద్దేశించిందన్నారు. ప్రతి నెలా ఒక అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకొని కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగం, ఎంపీడీవోలు, తహశీల్దార్లు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రాలలో ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలోనూ ఎంపిక చేసిన సచివాలయం పరిధిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెత్తను దహనం చేయరాదన్నారు. ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలలో చెత్త లేకుండా పరిశుభ్ర పరచాలని ఆదేశించారు. అక్కడ నుంచి తొలగించిన చెత్తను నిబంధనల మేరకు చెత్త సంపద కేంద్రాలకు పంపాలన్నారు. కుళ్లిపోయే చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో వచ్చే చెత్త, ప్రమాదకరమైన చెత్తను వేర్వేరుగా వేసేలా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోడానికి విస్తతంగా మొక్కలు నాటాలని, వ్యర్థాల తొలగింపు పద్ధతి ప్రకారం చేపట్టాలన్నారు. బీసీలు, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కులాల వారు, కాపుల ఆర్థిక అభివద్ధి కోసం రుణ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రుణ సదుపాయం పొందగోరే అభ్యర్థులు గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో అధికారులు విధిగా ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గవర్నర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం జీవో 520ను విడుదల చేసిందన్నారు. ప్రజాప్రతినిధుల హెూదాలు, వారి అధికారాల ఆధారంగా ప్రోటోకాల్ విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రోటోకాల్ పాటించకపోతే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో ప్రోటోకాల్‌పై అధికారులకు అవగాహన ఉండాలని, ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ఆహ్వాన పత్రికలు, శిలాఫలకాలలో పేర్లు పొందుపరచడంలోనూ ప్రోటోకాల్ విధిగా పాటించాలని ఆదేశించారు.

ప్రజల సమస్యలపై డిఆర్‌సిలో ప్రజాప్రతినిధులు ప్రశ్నించిన అంశాలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ధాన్యం సేకరణలో బాపట్ల జిల్లా లక్ష్యం మేరకు 50 వేల మెట్రిక్ టన్నుల సేకరణ జరిగిందన్నారు. అదనంగా మరో 25 వేల మెట్రిక్ టన్నుల సేకరణకు అనుమతివ్వాలని ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో లక్ష్యాలు చేరుకోవాలన్నారు. వందరోజుల ప్రణాళిక అమలు, పురోగతిపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. సాగునీటి కాల్వల పని తీరు, పూడికతీత పనులు, రబీ సీజన్లో నీటి విడుదల, ఎత్తిపోతల పథకాల అమలు తీరుపై సమీక్షించారు. ఉపాధి హామీ పథకం అమలు తీరు, అభివద్ధి కార్యక్రమాల లక్ష్యాలను చేరుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

శింగరాయకొండ మండలంలోని పాకల, పాత శింగరాయకొండ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మలా కుమారి, ఏవో సుధాకర్ పాల్గొన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల కుమారి మాట్లాడుతూ పిఎం కిసాన్ పథకం కింద నమోదైన ప్రతి రైతు మార్చి 31 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ స్థానిక రైతు సేవ కేంద్రాలలో పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం వరి పంటను పరిశీలించారు. వరిలో పొటాష్ ధాతు లోపాలను, ఆకు ముడతను గుర్తించినట్లు వారు తెలిపారు. వీటి నివారణకు ఎకరాకు 20 కేజీలు పోటాష్ పైపాటుగా వేసుకోవాలన్నారు. ఆకు ముడత నివారణకు ఎసిపేట్ మందును 1 గ్రా. లీటర్ నీటికి కలిపి 200 లీటర్లు ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జహీర్, గ్రామ వ్యవసాయ సహాయకులు కిషోర్, సురేష్, అరుణ్‌చంద్, రైతులు పాల్గొన్నారు.




వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

**కొండపి:** కొండపి మండలంలోని ఇలవర, కట్టావారిపాలెం గ్రామాల్లో శుక్రవారం కొండపి మండల వ్యవసాయాధికారి డి.విజయకుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కంది, మిరప పంటలను అధికారులు పరిశీలించారు. మిరప పంటలో పైముడత నివారణకు పిప్రోనిల్ 80 శాతం డబ్ల్యుజి 40 గ్రాములు, క్రింది ముడత నివారణకు డయాఫంతియురాన్ 50 డబ్ల్యూపి 300 గ్రాములు లేదా పోలిస్ అనే మందు 40 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా కంది పంట నందు పూత దశలో గూడు పురుగు మరియు, పిందె కాయ దశలో కాయ ఈగ గమనించడం జరిగిందన్నారు. దీని నివారణకు ఇండాక్సికాబ్ 200 మి.లీ/200 లీటర్ల నీటికి మరియు ఒక వారం వ్యవధిలో నోవాల్యూరాన్ (రీమాన్) 200 మి.లీ/200 లీటర్ల నీటిలో కలిపి పూత, పిందె, కాయ తడిచే విధంగా స్ప్రే చేసుకోవాలని రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరావు, వెంకట నారాయణ, రైతులు పాల్గొన్నారు.

## నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

**ప్రజాశక్తి-టంగుటూరు**

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా టంగుటూరు మండలం కందులూరు గ్రామంలో ఎన్టీఆర్, స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ఆవిష్కరణ జరుగుతుందని కందులూరు టీడీపీ నాయకులు దామచర్ల బసవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

## శిద్దా సుబ్బారావుకు నివాళి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

శ్రీ వాసవి గ్రానైట్స్ అధినేత దివంగత శిద్దా వెంకట సుబ్బారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులర్పించారు. శిద్దా వెంకట సుబ్బారావు కుమారులు శిద్దా హనుమంతరావు, శిద్దా సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. శుక్రవారం శిద్దా సుధాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంత నూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు, మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.జవహర్, తెలుగుదేశం జిల్లా నాయకులు కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, కందిమల్ల గంగాధర్ రావు, మన్నం ప్రసాద్, సూరంపల్లి హనుమంతరావు, శిద్దా బాలాజీ, శిద్దా సురేష్, శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా కాశి విశ్వేశ్వరరావు, శిద్దా వెంకటేశ్వర ఆంజనేయ ప్రసాద్, డాక్టర్ బొమ్మిశెట్టి సుబ్రమణ్యం, పలువురు ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న ఏడీఏ రమేష్ బాబు

## ఎరువులు అందుబాటులో ఉంచాలి

**ప్రజాశక్తి-కొత్తపట్నం**

ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఏడీఏ రమేష్ బాబు అన్నారు. కొత్తపట్నం మండలంలోని రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల వ్యాపారులతో ఒంగోలు ఏడీఏ బి.రమేష్ బాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. నిర్దేశించిన ధరలకు మాత్రమే రైతులకు అమ్మాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రతీ షాపులో ధరల పట్టికను తప్పనిసరిగా ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రసీదు ఇవ్వాలన్నారు. అలాగే రైతులందరూ రసీదును అడిగి మరీ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఏవో సిహెచ్ అజయ్, టి.శ్రీనివాసరావు, హైదర్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపోరాటాలతోనే 'వెలిగొండ' సాధన

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి**



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి

ప్రజాశక్తి - కనిగిరి

వెలుగొండ ప్రాజెక్ట్ జలాల సాధన కోసం కార్మిక, కర్షక, ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, పిసికేశవరావు తెలిపారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం జరిగిన సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కార్యదర్శి జి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సమావేశంలో కొండారెడ్డి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కనిగిరి పట్టణంలో ఈనెల 23న వెలిగొండ జలాల సాధన సదస్సు జరుగుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే పశ్చిమ ప్రకాశం అందులోనూ వెనుకబడిన కనిగిరి ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. తద్వారా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్మిక, కర్షక ప్రజానీకం వెలుగొండ జలాల సాధన సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఆర్ మాలకొండయ్య, నరేంద్ర, యు పిచ్చయ్య, వెంకటరెడ్డి, పేతురు, సిహెచ్ ప్రసాద్, లక్ష్మయ్య, ఆనంద్, ఎలీషా, బాలస్వామి, రవి, మా భాష, ఆదిలక్ష్మి, శాంత కుమారి, లక్ష్మీదేవి, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - దొనకొండ

దొనకొండ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు కాళ్ల హనుమంతరావు అధ్యక్షతన స్థానిక రామాలయంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పరుచూరి రమేష్, ఉపాధ్యక్షుడిరెడ్ల శేషుకుమార్, కార్యదర్శి మాడిశెట్టి రాజు, జాయింట్ కార్యదర్శి వీరాల సురేష్, కోశాధికారిగా సూరే సాయి, అయ్యప్ప, నితిన్‌లతో కూడిన మరికొందరు సభ్యులతో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి తమవంతుగా బాధ్యతగా పనిచేస్తామని నూతన సంఘం పేర్కొన్నారు.

## టవర్‌ను అల్లుకున్న చెట్టు

ప్రజాశక్తి - కొనకనమిట్ల


టవర్‌ను పిచ్చి చెట్లు అలుముకున్న దృశ్యం

మండలంలోని గరిమెన పెంట గ్రామ శివారులోని పోస్టల్ టవర్‌ను పిచ్చిచెట్లు అలుముకున్నాయి. ఆ గ్రామం వైపు వెళ్ళేవాహన చోద కులు, కాలినడకన వెళ్లే ప్రయాణికులు ఇంత ఎత్తులో ఉన్న చెట్టు ఏమిటా అని దగ్గరకెళ్ళి చూస్తున్నారు. చూసిన తర్వాత గాని అది పోస్టల్ టవరా అని ఆశ్చర్య పోతున్నారు. ఒకప్పుడు ప్రజలకు ఎంతో సమాచారం అందించిన పోస్టల్ టవర్ నేడు పనికి రాకుండా నిరుపయోగంగా ఉంది. ఈ టవర్‌ను ఎవ్వరూ పట్టించుకోవడంతో పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి.


కంది పరిశీలిస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

## 'కంది'కి మద్దతు ధర ఇవ్వాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

తుఫాను ప్రభావం వల్ల కంది పంట పూత నిలవక సగం పంట దెబ్బతిన్నదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.ప్రసాద్ డిమాండ్ చేశారు. కొనకనమిట్లలో సాగు చేసిన కంది, బొబ్బర్లు, మినుము పంటలను స్థానిక రైతు సంఘం నాయకులు, రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. తుఫాన్ వల్ల ముసురు వర్షాలకు సగం పూత రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నట్లయితే ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం రెండు క్వింటాలకే పరిమితమైందన్నారు. బొబ్బర్లు, మినుము పంటలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కూడా ఇప్పటికీ అందించలేదన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా ఈ ఏడాది వచ్చే పరిస్థితి కనిపించలేదని, ప్రభుత్వం దెబ్బ తిన్న పంటలను పరిశీలించి ఆదుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ ఎపి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పివి కొండయ్య, అధ్యక్షులు సిగినం వెంకటేశ్వర్లు, నాయకులు సిహెచ్ సిద్దయ్య, రామ కృష్ణయ్య, తిరుపతిరెడ్డి, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

## రేపు 'గాండ్ల' సంఘం సమావేశం

ప్రజాశక్తి - పొదిలి

ఈనెల 19న ఆదివారం కొనకనమిట్ల మండలంలోని శ్రీ వెలుగొండ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గల గాండ్ల సంక్షేమ సంఘ సమావేశం అన్నదాన సత్రంలో జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు తెలిపారు. జిల్లా నూతన కమిటీ ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకులు తంగేళ్ల నాగభూషణం, గాండ్ల సంక్షేమ సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బచ్చల శివప్రసాద్, పరికుంట్ల వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవ సలహాదారులు చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, భీమవరపు పిచ్చయ్య హాజరవుతున్నారని తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీ

**లబోదిబోమంటున్న ఆయకట్టు రైతులు**


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి రాగి తీగ చోరీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం రాత్రి గుర్తుతెలియని దొంగలు పగలగొట్టిన ఘటన మండలంలో గురువారం రాత్రి జరిగింది. కొనకనమిట్ల గ్రామానికి చెందిన రైతులు పునుగోటి కొండారెడ్డి, ఎద్దుల ప్రసన్న ఆంజనేయులు, గొట్లగట్టు గ్రామానికి చెందిన మరొక రైతుకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం అర్ధరాత్రి పగలగొట్టి అందులోని రాగి తీగ, ఆయిల్‌ను దొంగలు తీసుకువెళ్లారని రైతులు లబోదిబో అంటున్నారు. శుక్రవారం యథావిధిగా రైతులు సాగు చేసిన పంటలకు నీరు పెట్టేందుకు పొలాలకు వెళ్లి చూడగా దిమ్మెల మీద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడవేసి పగలగొట్టి ఉన్నాయి. అందులోని ఆయిల్, రాగి తీగ, ఇతర విలువైన సామాన్లను తీసుకొని మిగతా వాటిని అక్కడే చల్లా చేదురుగా పడవేసి వెళ్లారని రైతులు ప్రజాశక్తితో వాపోయారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేసుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకొని పంటలకు నీరు పెట్టుకుంటున్న తరుణంలో ఈ చోరీ జరగడం ఇబ్బందులకు గురైనట్లయిందన్నారు. దొంగలు అపహరించుకపోవడంతో మరింత అప్పుల్లో కూరుకుపోతామని లబోదిబో అంటున్నారు. విషయాన్ని తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు పొలాలకు వచ్చి దొంగలు పగలగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారని తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ టి రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు రైతులు పొనుగోటి కొండారెడ్డి, ఎద్దుల ప్రసన్నాంజనేయులు తెలిపారు. గత నెలలో కొనకనమిట్ల గ్రామానికి చెందిన ఇరువురు రైతులకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు అపహరించుకుపోయారని తెలిపారు. ఇప్పటికీ ఆ దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవని, వరుస సంఘటనలు రైతులను కలవరపెడుతున్నాయి.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి




పొలం తెలుస్తుందిలో మాట్లాడుతున్న తాళ్లూరు ఏవో ప్రసాద్‌రావు

ప్రజాశక్తి-తాళ్లూరు

మండలంలోని నాగంబొట్లపాలెం, తూర్పుగంగవరం గ్రామాల్లో వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు ఆధ్వర్యంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒరిగల సాగు అన్ని సీజన్‌లలో అనువైన పంట అన్నారు. ప్రకృతిసాగు పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో పురుగులు, తెగుల్ల నివారణ చేపట్టి రసాయన రహిత ఉత్పత్తులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి సాగు ఇన్‌చార్జి పి నరసింహాలు, విసిఆర్‌ఎ వాణి, రైతులు పాల్గొన్నారు.

**దర్శి:** మండలంలో దర్శి-1, దర్శి -3 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయ శాఖ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. వ్యవసాయశాఖలో అవలంబిస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా క్షేత్ర సందర్శన జరుగుతుందని తెలిపారు. పంటలపై ఆశించు చీడ, పీడలు, తెగుళ్ల గురించి క్షేత్ర సందర్శన ద్వారా తెలియజేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. నమోదు చేసుకుంటే అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయన్నారు.


రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న దర్శి ఏవో బాలకృష్ణనాయక్

## రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం

**ప్రజాశక్తి వార్తకు స్పందన**

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని శీలంవారిపల్లి నుండి పెదరాజుపాలెం వరకు రోడ్డు నిర్మాణంకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని పిఐయు డిఇఇ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రజాశక్తి దినపత్రికలో 'ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. నిధులు మంజూరైన వెంటనే రోడ్డు నిర్మాణ పనులను వీలైనంత త్వరలో పూర్తి చేసే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు.


వెంగయ్యను సన్మానిస్తున్న క్షేత్ర సహాయకులు

## క్షేత్ర సహాయకులు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

క్షేత్ర సహాయకులు గ్రామాల్లో ప్రజలకు బాధ్యతగా ఉంటూ పని చేయాలని టిడిపి మండల అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక ఆర్ఎంఎస్ కళ్యాణ మండపంలో క్షేత్ర సహాయకులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలువురు క్షేత్ర సహాయకులు డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపిడిఓ రంగసుబ్బారాయుడిని క్షేత్ర సహాయకుల సంఘం మండల అధ్యక్షుడుగా ఎన్నికైన విక్రంరాజును సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి, కె వెంకటకొండయ్య, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, బండారు మల్లికార్జున, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎన్‌టిఆర్ వర్ధంతి


ప్రజాశక్తి-దర్శి

తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం నియోజక వర్గంలో పర్యటించనున్నట్లు తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. ముండ్లమూరు టౌన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తారు. తాళ్లూరు టౌన్‌లోని ఎన్‌టి ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు దర్శి టౌన్ గడియార స్థంభం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహం, నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. దొనకొండ, కురిచేడు టౌన్లో ఎన్‌టిఆర్ వర్ధంతిలో పాల్గొంటారు. సాయంత్రం కెల్లంపల్లి పంచాయతీలోని బసవాపురం గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ చేస్తారని తెలిపారు.

# ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలి

**ప్రజాశక్తి- అద్దంకి**

రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ తెలిపారు. మండల పరిధిలోని ధేనువకొండ, గోపాలపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజ్ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిసాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులందరూ తప్పనిసరి గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎఒ కొర్రపాటి వెంకటకష్ణ మాట్లాడుతూ మంచు కారణంగా వరి కంకులలో మానికాయ ఏర్పడినట్లు తెలిపారు. పంట దెబ్బ తినకుండా ఉండేందుకు కార్బన్‌డిజం ఎకరాకు 250 గ్రాముల వంతున పిచికారీ చేయాలన్నారు.ఉద్యాన అధికారి ఎస్.దీప్తి మాట్లాడుతూ రాయితీపై తైవాన్ స్ప్రేయర్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వీరెష్, జొన్నలగడ్డ కృష్ణ,యర్రా రాఘవయ్య, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.




ఇంకొల్లులో మాట్లాడుతున్న ఎడిఎ మోహనరావు



అద్దంకిలో మాట్లాడుతున్న ఎడిఎ కె.ధనరాజ్

**ఇంకొల్లు :** మండల పరిధిలోని పూసపాడు, హనుమోజీ పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోందది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. మోహనరావు మాట్లాడుతూ శనగపంటలో వచ్చే పచ్చపురుగు నివారణకు ఎకరాకు 200 మిల్లీలీటర్ల ఇండాక్సికార్బ్ లేదా 60 మిల్లీలీటర్ల రైనాక్సిపైడ్ పిచికారీ చేయాలన్నారు. కుంకుమ తెగులు (తుప్పు) నివారణకు హెక్సకోనో జోల్ 400 మిల్లీలీటర్లు లేదా ప్రోపికోనోజోల్ 200 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలన్నారు. ఎఒ వేణుగోపాల్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువర్ధక శాఖ, వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు షాకీర్ పాషా

## రీసర్వేకు సహకరించాలి : తహశీల్దారు

**ప్రజాశక్తి - నిజాంపట్నం**

భూముల రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని తహశీల్దారు షాకీర్ పాషా కోరారు. మండల పరిధిలోని ముత్తుపల్లి గ్రామంలో భూముల రీసర్వే పై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఈ నెల 20న ముత్తుపల్లి గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు.రీ సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలన్నారు. తమ భూమికి సంబంధించిన పత్రాలు అదికారులకు అందజేస్తే భూమిని కొలిచి హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. భూముల రీసర్వే పై గ్రామంలో విస్తతంగా ప్రచారం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు తహశీల్దారు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పిట్టు లక్ష్మి ఏడుకొండలు రెడ్డి, విఆర్ఒ వేణు, జ్యోతి, నాగలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ శివలీల, సర్వే అధికారులు, సిబ్బంది, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఆత్మీయ ససమావేశంలో పోపూరి రామయ్య, వీరమ్మ కుటుంబీకులు

## 'పోపూరి' కుటుంబీకుల ఆత్మీయ కలయిక

**ప్రజాశక్తి- పర్చూరు**

మండలపరిధిలోని ఇనగల్లు గ్రామానికి కీర్తిశేషుడు పోపూరి రామయ్య వీరమ్మ దంపతుల కుటుంబీకులు నాలుగు తరాల వారు శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రామయ్య, వీరమ్మ దంపతులు కుమారులు, కోడళ్ళు, కూతుళ్ల అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్లు, ముది మనుమలు, ముది మునుమరాళ్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సాధక బాధకాలను, భావాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమ కలయిక పట్ల ఆనందాన్ని వ్యక్త పరిచారు. ఈ ఆత్మీయ కలయికలో సుమారు 26 మంది పాల్గొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పిన్నక సాంబశివరావు ఆత్మీయ కలయిక యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. సభ్యులు పేదలందరికీ సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి జనరల్ నాలెడ్జ్ మరియు కంప్యూటర్ సైన్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించిన బహుమతులు అందజేశారు. వచ్చే సంవత్సరం కూడా ఇలాగే సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం ఆనందోత్సాహాలతో తమ తమ గ్రామాలకు వెళ్లారు.

## నేడు 'స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్'

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కోసం సహకరించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం చెత్త కుప్పలు తొలగించడం, పిచ్చి మొక్కలు తొలగించడం, మురుగు కాలువల శుభ్రం చేయడం, స్వచ్ఛ ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛ ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అఈ మేరకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

## బాపట్ల మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా లక్ష్మీనారాయణ

**ప్రజాశక్తి-బాపట్ల**



లక్ష్మీనారాయణ

బాపట్ల పురపాలక సంఘం స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది కె. లక్ష్మీనారాయణ నియమితులైనట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాధ రెడ్డి తెలిపారు.ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి బాపట్ల మున్సిపల్ కార్యాలయానికి శుక్రవారం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. లక్ష్మీనారాయణ మూడేళ్ల పాటు స్టాండింగ్ కౌన్సిల్‌గా కొనసాగుతారని కమిషనర్ పేర్కొన్నారు.

## 18 నుంచి శ్రీత్యాగరాయ ఉత్సవాలు

**ప్రజాశక్తి - చీరాల**

చీరాల చైతన్య భారతి ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజ స్వామి ఉత్సవాలు ఈ నెల 18 నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు చైతన్య భారతి సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, నారాయణ శాస్త్రి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ముంతావారి సెంటర్‌లోని ఎన్‌వి ఎస్ అండ్ ఎస్‌జె ఆర్ కళ్యాణ మండపంలో ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ప్రముఖ సంగీత విద్వాంసులు పోటూరి లక్ష్మీనరసింహారావు 24వ వర్ధంతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న శ్రీ త్యాగరాజు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరై తమ ప్రతిభను ఘనపరుస్తారని అన్నారు. కళాకారులు, సంగీత అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

## వాహనచోదలకు అవగాహన

**ప్రజాశక్తి - చీరాల**



వాహన చోదకులలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

వాహన చోదకులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరాలని ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్స వాల్లో భాగంగా ఈపురుపాలెం హైస్కూల్ సెంటర్ వద్ద చీరాల-బాపట్ల రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులకు రోడ్డు భద్రత ప్రమాణాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహన డ్రైవర్లు సీట్ బెల్ట్ కచ్చితంగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. వాహనాలను పరిమితికి మించి వేగంగా నడపరాదన్నారు. వాహనదారు లందరూ విధిగా ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్,పొల్యూషన్ సర్టిపికెట్లు కలిగి ఉడాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలంటే భద్రతా ప్రమా ణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

## రహదారి వెంబడి గృహాలు తొలగింపు

**ప్రజాశక్తి - పంగులూరు**

2011లో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నష్టపరిహారం చెల్లించి సేకరించిన స్థలాల్లోని కట్టడాలను తొలగిస్తున్నట్లు తహశీల్దారు పి. సింగారావు, హైవే సైట్ ఇంజినీర్ హుస్సేన్ తెలిపారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లేని కారణంగా వర్షపు నీరు, మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేని కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు వారు తెలిపారు. నివాస గహాల ముందు నీరు నిలిచి తాము పడుతున్న ఇబ్బందుల గురించి ఇటీవల రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రామస్తులు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ గ్రామంలో మురుగునీరు నిల్వ లేకుండా ఉండేందుకు కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ఈనెల 8న జాతీయ రహదారి విలువైపులా సర్వే చేసి హద్దులు నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అడ్డుగా ఉన్న స్ట్రక్చర్లను క్రేన్ ద్వారా శుక్రవారం నుంచి తొలగిస్తున్నట్లు తహశీల్దారు సింగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు, టోల్ మేనేజర్ ఆనందరావు, రూట్ ఆపరేటర్ నరసింగారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గృహాలను తొలగిస్తున్న దృశ్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

# 20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జిల్లాలోని ప్రతి గ్రామంలో ఈనెల 20 నుంచి 31 వరకు జరిగే పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరగనున్న పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాలలో పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందజేస్తారన్నారు. అన్ని గ్రామాలలోని తెల్ల పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణా టీకాలు, అన్ని పశువులకు గొంతువాపు వ్యాధి నివారణా టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలలో ఎదకురాని, గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా చికిత్సలు అందిస్తామన్నారు. ప్రతి మండలంలో రోజుకు రెండు గ్రామాల చొప్పున శిబిరాలు జరుగుతాయని, ఇందుకు సంబంధించి పశు వైధ్యాదికారి, పారా సిబ్బంది, పశువైద్య సహాయకులతో కూడిన రెండు బందాలు ఏర్పాటు చేశామనానరు. ఈ ఆరోగ్య శిబిరాలతో గ్రామాలలో వున్న పాడి పశువులు, గొర్రెలు, మేకలకు ఉత్పాదక శక్తి పెరుగుతుందన్నారు. పశువులలో ఈతకు ఈతకు మధ్య వ్యవధి తగ్గి ఏడాదికి ఒక దూడను పొందవచ్చున్నారు. జిల్లాలోని ప్రతి పాడిరైతులు, జీవాల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

స్థానిక కర్నూలురోడ్డులోని ఆర్టీసి బస్టాండ్ వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వర రావు శుక్రవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులకు సంబంధించి స్థానిక దుకాణ యజమానులు వారి అభ్యంతరాలను కమిషనర్ దష్టికి తీసుకొచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు చేపడతామని దుకాణాల యజమానులకు హామీ ఇచ్చారు. అభివద్ధి పనులకు దుకాణాల యజమానులు సహకరించాలని కోరారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుధాకర్, టిపిఓ బాబురావు, టిపిఎస్ శివప్రసాద్, నారాయణ రావు, డిఈఈ ఐసయ్య, ఏఈ చాణక్య, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు. అనంతరం కమిషనర్ ఐదో పారిశుధ్య డివిజన్ పరిధిలోని కొత్తపట్నం బస్టాండ్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. తరువాత కొత్త కూరగాయల మార్కెట్ లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు.


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

# పటిష్టంగా పిఎం జన్‌మన్ పథకం అమలు

కలెక్టర్ తమీమ్‌అన్సారియా

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

గిరిజనుల అభివద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహ అభియాన్ (పిఎం జన్ మన్) పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కలెక్టర్ పిఎం జన్ మన్ కార్యక్రమం అమలుపై గహనిర్మాణం, పంచాయతీరాజ్, ఎపిసిపిడిసిఎల్, వైద్యారోగ్యం, విద్య, గ్రామీణ నీటి సరఫరా, బిఎస్ఎన్ఎల్, స్త్రీ, శిశు సంక్షేమం శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల అభివద్దే లక్ష్యంతో గిరిజనులు , చెంచులు నివసిస్తున్న హాబిటేషనల్లో సురక్షితమైన గహాలు, స్వచ్ఛమైన త్రాగునీరు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, విద్య, పోషకాహారం, రహదారి, టెలికమ్యూనికేషన్స్ కనెక్టివిటీ, స్థిరమైన జీవనోపాధికి అవకాశాలతో వివిధ శాఖలకు సంబంధించిన 11 ఇండికేటర్స్ ను కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో నిర్దేశించిందన్నారు. ఆ ఇండికేటర్స్‌లో మంజూరైన పనులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకొంటూ, గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంబంధిత శాఖల అధికారులు కషి చేయాలన్నారు. ఈ పథకంలో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్, ఐటిడిఎ పిఓను ఆదేశించారు. సమావేశంలో డిఎఫ్ఓ సందీప్ కృపాకర్, ఐటిడిఎ పిఓ వెంకట శివ ప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఐసిడిఎస్ పీడీ హేన సుజన, జిల్లా విద్యా శాఖాధికారి ఏ. కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబి రాణి, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాస రావు, ఎపిసిపిడిసిఎల్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులు

# సమస్యలపై సానుకూలంగా స్పందించాలి..

కలెక్టర్ వెంకటమురళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారంలో అధికారులు సానుకూలంగా స్పందించాలని కలెక్టర్ జె. వెంకటమురళి ఆదేశించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కార కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో జరిగింది. దివ్యాంగుల నుంచి వచ్చిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. గతంలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆరా తీశారు. జిల్లాలో వికలాంగుల సంక్షేమ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదన పంపామన్నారు. జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రానికి దివ్యాంగులు వచ్చేలా బస్సు సౌకర్యం ఏర్పాటుపై చర్చించారు. దివ్యాంగులు బాపట్లకు వచ్చేలా బస్సు సౌకర్యం ఎందుకు ఏర్పాటు చేయలేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దివ్యాంగులు అర్జీలు పెట్టి నెల గడిచినా ఎందుకు స్పందించలేదని ఆరా తీశారు. బస్సు సౌకర్యంపై వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి ఆర్టీసీ అధికారులకు పంపాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే దివ్యాంగులకు కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ చేపడతామన్నారు. మంచం పట్టిన వ్యాధిగ్రస్తులకు రూ.15వేలు పింఛను మంజూరు కోసం గుంటూరు జనరల్ ఆసుపత్రికి తీసుకువెళ్లే బాధ్యత జిల్లా వైద్య శాఖ అధికారిపై ఉందన్నారు. అక్కడ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తేనే పింఛన్ మంజూరు అవుతుందన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించటానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను వెనువెంటనే పరిష్కరిస్తే అర్జీదారులు సంతోషం వ్యక్తపరుస్తారన్నారు. వచ్చిన తక్కువ అర్జీలను కూడా పరిష్కరించకపోవడం పట్ల అధికారులలో నిర్లిప్తత కనిపిస్తోందన్నారు. అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి వారంలో మూడు రోజుల పాటు బాపట్లలో అందుబాటులోనే ఉండి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యలపై ఆన్ లైన్ లో వచ్చిన అర్జీలను అధికారులు చూడటం లేదన్నారు. అర్జీల పరిష్కారంపై సంబంధిత అర్జీదారునికి ఫోన్ చేసి అవగాహన కల్పించాలన్నారు. వారిని సంతప్తి పరచాలన్నారు. అర్జీలు పునరావతం గాకుండా చూడాలన్నారు. కిందిస్థాయిలో అర్జీల పరిష్కారంలో నాణ్యత పెంచేందుకు గ్రామ, మండల స్థాయిలలో సిబ్బందికి శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కులగణన కింద వచ్చిన అర్జీలను పుర్తి స్థాయిలో పరిష్కరించాలన్నారు. కులగణన అర్జీల స్వీకరణ గడువు ఈనెల 16 నుండి 20 తేదీకి ప్రభుత్వం పొడిగించిందన్నారు.


వికలాంగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

**నాలుగో శుక్రవారం ప్రత్యేక పరిష్కార కార్యక్రమం**

ప్రతినెల మూడో శుక్రవారం నిర్వహించే ప్రత్యేక దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నాలుగో శుక్రవారానికి మార్చినట్లు కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. గిరిజన ప్రజల సమస్యల పరిష్కార కార్యక్రమంతో పాటు దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమం కలిపి నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కళాపరిషత్

# నాటకోత్సవాలు జయప్రదం చేయండి

- అధ్యక్షులు ఈదర హరిబాబు
- నేటి నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహణ
- విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాల ప్రదర్శన


మాట్లాడుతున్న ఈదర హరిబాబు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరిగే నాటకోత్సవాలలో జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని అధ్యక్షులు ఈదర హరిబాబు కోరారు. ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో నాటకోత్సవాల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఈదర హరిబాబు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో వందల నాటకాలు, వేల నాటికలు, కళారూపాలను ప్రదర్శించామన్నారు. ఈనెల 18 శనివారం రాత్రి 8 గంటలకు ఎన్టీఆర్ సంస్మరణ సభ జరుగుతుందని, ముఖ్య అతిథులుగా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సాయంత్రం 4 గంటలకు మంగళ వాయిద్యాలతో స్వాగతం, సన్నాయి కచేరి, ఐదు గంటలకు మక్కెనవారిపాలెం జడ్పీ హైస్కూలు విద్యార్థుల కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. రాత్రి 8.15 గంటలకు కూచిపూడి డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, శిష్య బృందంతో భక్త ప్రహ్లాద నృత్యరూపకం ఉంటుందన్నారు. ఈనెల 19 సాయంత్రం 4 గంటలకు పాత చీరాల నటరాజ నాదస్వర బృందంతో నాద స్వర కార్యక్రమం, 5 గంటలకు కొప్పోలు శ్రీ సరస్వతి కోలాల సమాజం కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. రాత్రి 7.30 గంటలకు కరీంనగర్ చైతన్య భారతి వారి శ్రీకృష్ణ కమల పాలిక పద్య నాటకం ప్రదర్శిస్తారన్నారు. ఈనెల 20న రాత్రి 7.30 గంటలకు ఒంగోలు చందు డాన్స్ అకాడమీ నాట్యోద్భవం నృత్య రూపకం ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈనెల 21న రాత్రి 7.30 గంటలకు విజయవాడ దృశ్య వేదిక కనక పుష్యరాగం సాంఘిక నాటకం, ఈనెల 22న రాత్రి 7.30 గంటలకు వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ రాత సాంఘిక నాటిక, 8.30 గంటలకు పొన్నూరు రసఝరి వారి గురి తప్పిన వేట సాంఘిక నాటిక ప్రదర్శిస్తారన్నారు. ఈనెల 23న రాత్రి 7 గంటలకు గుంటూరు అభినయ ఆర్ట్స వారి ఇంద్ర ప్రస్థం సాంఘిక నాటిక, 8 గంటలకు కర్ణాటక బంగారు పేట భారత కళా గ్రామ నాట్య గురుకులమ్ పాండు రంగం భజే నృత్యరూపకం ప్రదర్శితమవుతుందన్నారు. ఈనెల 24న రాత్రి 7 గంటలకు గుంటూరు శ్రీ సద్గురు కళా నిలయం వారి కమనీయం సాంఘిక నాటి, రాత్రి 8 గంటలకు ఒంగోలు శ్రీ నళిని ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ శంకర విజయం నృత్య రూపకం ఉంటుందన్నారు. ఈనెల 25న రాత్రి 7 గంటలకు విశాఖ తెలుగు కళా సమితి వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత సాంఘిక నాటిక, ఈనెల 26న రాత్రి 7 గంటలకు బొరివంక శార్వాణీ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థ వారి కొత్త పరిమళం సాంఘిక నాటిక, 8.30 గంటలకు కొప్పోలు పండు క్రియేషన్స్ వారి పక్కింటి మొగుడు సాంఘిక నాటిక ప్రదర్శిత మవుతుందని తెలిపారు. ఈ నెల 27న రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్ కళాంజలి వారి జారుడు మెట్లు సాంఘిక నాటకం, ఈనెల 29న రాత్రి 7.30 గంటలకు గుంటూరు శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ విప్రనారాయణ నృత్య రూపకం ఉంటుందన్నారు. ఈనెల 30న రాత్రి 7.30 గంటలకు కాకినాడ శ్రీ కుమార రామ భీమేశ్వర కళాకారుల సంఘం వారి నర్తనశా పద్య నాటకం, ఈనెల 31న రాత్రి 7.30 గంటలకు కర్నూల్ టిజివి కల్చరల్ అకాడమీ శ్రీ వెంకటేశ్వర మహత్యం ప్రదర్శితమవుతుందన్నారు. ఫిబ్రవరి 1న రాత్రి 7.30 గంటలకు చెన్నై కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ రుక్మిణీ కళ్యాణం నృత్య రూపకం, ఫిబ్రవరి 2న రాత్రి 7.30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనగా చందు డాన్స్ అకాడమీ దందు శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం ఉంటుందన్నారు. నాటకోత్సవాలలో భాగంగా ఎన్టీఆర్ జీవిత సాఫల్య సాధనా పురస్కారం చీరాలకు చెందిన ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమాలలో జిల్లా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యదర్శి అన్నమనేని ప్రసాద్, సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ ఈపూరు శివ ప్రసాద్, ఈదర హరిబాబు తనయుడు గౌతమ్ పాల్గొన్నారు.